క్లుప్తంగా

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు


బంగారు, వెండి పుష్పాలతో అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు, బంగారు పుష్పాలతో పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత


వీకే రాయపురంలోని రైల్వే గేటు

సామర్లకోట: మండలంలోని వీకే రాయపురం నుంచి ఏడీబీ రోడ్డు మార్గంలో ఉన్న రైల్వే గేటును శనివారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ మార్ని రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే గేటు పరిధిలో ట్రాక్ మరమ్మతులను దృష్టిలో ఉంచుకుని గేటు మూసివేసి, రాకపోకలు నిలిపివేయనున్నట్టు వివరించారు. ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించే వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలన్నారు. వీకే రాయపురం రైల్వే గేటు మీదుగా పొలాలకు, ఏడీబీ రోడుకు వెళ్లే వారు ఉండూరు రైల్వే గేటు, మాధవపట్నం వద్ద ఉన్న రైల్వే గేటు మీదుగా రాకపోకలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రైల్వే గేటు మూసివేస్తున్న విషయాన్ని సామర్లకోట మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పోలీసు స్టేషన్, లారీ, ఆటో యూనియన్ ప్రతినిధులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని సూచించారు.

శాంతిభద్రతలకు అందరూ సహకరించాలి


వేట్లపాలెంలో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: ప్రతిఒక్కరూ శాంతి భద్రతలకు సహకరించాలని సీఐ ఎ.కృష్ణభగవాన్ కోరారు. శుక్రవారం వివిధ గ్రామాల పర్యటనలో భాగంగా వేట్లపాలెం శివారు మంగాయమ్మ కాలనీ హైస్కూల్ మార్గంలో కొందరు గుంపులుగా ఉండటంతో, సీఐ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళలు, యువతులు, బాలికలతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బాలికలతో అసభ్యంగా పవర్తించే వారిని పెద్దలు మందలించాలని సూచించారు. మహిళా చట్టాల ప్రకారం, మహిళలు ఫిర్యాదులు చేస్తే కఠినమైన శిక్షలు ఉంటాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. జూదం, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఖాళీగా ఉన్న యువకులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదువుకోవాలని సూచించారు.

వాకతిప్పలో రీ సర్వే రెవెన్యూ గ్రామసభ

కొత్తపల్లి: వాకతిప్ప గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో రీ సర్వే రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. రీ సర్వేలో జరిగిన సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ గ్రామసభకు 37 దరఖాస్తులు అందినట్టు ఆయన తెలిపారు. వాటన్నింటిని రిజిస్టర్‌లో నమోదు చేసినట్టు తెలిపారు. 12న కొత్తపల్లి, 13న ఉప్పాడ, 14న సుబ్బంపేట, 16న గోర్సలో గ్రామసభలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

పెద్దాపురం: రాష్ట్రంలో బీజేపీ బలోపేతం కానుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి కె.సత్యకుమార్ యాదవ్ అన్నారు. స్థానిక రామారావుపేటలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పార్టీ నాయకుడు గొరగపూడి చిన్నయ్యదొర అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. కేంద్రం పథకాలు పార్టీ బలోపేతానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చెరుకూరి రామ్‌కుమార్, దుర్గా రామ్మోహనరావు, విత్తనాల వెంకటరమణ, టీడీపీ, జనసేన నాయకులు రాజా సూరిబాబురాజు, తుమ్మల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

దోమలు బాబోయ్ దోమలు!

- దోమలకు ఆవాసంగా మారిన పిఠాపురం
- పెరుగుతున్న అంటు వ్యాధులు
- మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు
- పట్టించుకోని అధికారులు


ఫాగింగ్ యంత్రాలు

పిఠాపురం: దోమలు ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. పెరుగుతున్న చెత్తచెదారం పని చేయని ఫాగింగ్ యంత్రాల కారణంగా ప్రజలు నరకం చూస్తున్నారు. ఒక పక్క దోమల మోత.. మరో పక్క పెరుగుతున్న మలేరియా, ఫైలేరియా విషజ్వరాలు, వాంతులు విరోచనాలు వంటి అంటువ్యాధులతో నానా అవస్థలు పడుతున్నారు. ఆదాయంపై దృష్టి పెడుతున్న అధికారులు ప్రజల ఆరోగ్యాన్ని మాత్రం విస్మరిస్తున్నారని పట్టణ వాసులు విమర్శిస్తున్నారు. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ దోమల వృద్ధిని గణనీయంగా పెరుగుతోందంటున్నారు దీనికి తోడు పట్టణ నడిబొడ్డున ఉన్న చెరుకుల కాలువ దోమల ఉత్పత్తి కేంద్రంగా మారి పట్టణ వాసులకు వ్యాధుల కారకంగా మారిందంటున్నారు. దీంతో ఎక్కడ చూసినా దోమల బాధ ఎక్కువైపోయింది.

చెత్తతో నిండిన డ్రైనేజీలు

పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డుల్లోనూ సుమారు 70 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ప్రతి రోజు టన్నుల కొద్ది చెత్త పేరుకుపోతోంది. వాటిని తొలగించడానికి చర్యలు సక్రమంగా తీసుకోకపోవడంతో చాలా చోట్ల చెత్త పేరుకుపోయి డ్రైనేజీలు నిండిపోయి, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దోమల నివారణకు ఉపయోగించాల్సిన ఫాగింగ్ యంత్రాలు మూలన పడ్డా అధికారులు పట్టించుకోవడంలేదు. గతంలో కొనుగోలు చేసిన యంత్రాలు ఐదేళ్లు అరకొరగా పనిచేయగా అనంతరం కొత్తగా కొనుగోలు చేసిన యంత్రాలు మరమ్మతులకు గురయినట్టు చెబుతున్నారు తప్ప వాటిని మరమ్మతులు చేయించాల్సిన అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో పట్టణంలో ఎక్కడ చూసినా దోమల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. దోమల బారి నుంచి కాపాడుకోవడానికి ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం అయితే చాలు ఎక్కడ చూసినా దోమల గోలే వినబడుతుందని స్థానికులు వాపోతున్నారు.

ఏ మాత్రం చర్యలు తీసుకోక..

దోమల నివారణకు పురపాలక సంఘం అధికారులు మాత్రం కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు మాత్రం కనిపించడంలేదు. డ్రైనేజీల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో అవి మురికి కూపాలుగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయని, దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని అయినప్పటికీ అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా రథాలపేట, కత్తులగూడెం, అగ్రహారం, ఇందిరానగర్, వంటి ప్రాంతాల్లో డ్రైన్లు అధ్వానంగా ఉన్నాయి. రాత్రి సమయాల్లో దోమల బారిన పడి పలు రోగాలకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలో పారిశుధ్య సమస్య పెరిగిపోవడంతో పాటు సేకరించిన చెత్తను పూర్తిగా తొలగించకపోవడంతో దోమల విపరీతంగా పెరిగి పట్టణంలో ప్రజలపై దాడి చేస్తున్నాయని అధికారులు వెంటనే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



పట్టణ పరిధిలోని పారిశుధ్యాన్ని పూర్తి స్థాయిలో మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాం. పట్టణంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఫాగింగ్ యంత్రాలు సిద్ధంగా ఉన్నాయి. వాటితో దోమల నివారణ మందులు పిచికారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దోమలు ఉత్పత్తి అయ్యే ప్రాంతాలను గుర్తించి తగిన నివారణా చర్యలు చేపట్టాం.

– ఎస్.కనకారావు, మున్సిపల్ కమిషనర్, పిఠాపురం

వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హిమమహేశ్వరి


శిక్షణకు హాజరైన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు

ఎంపీడీఓ హిమమహేశ్వరి

సామర్లకోట: గ్రామాల్లోని వివిధ వృత్తుల వారు తమ నైపుణ్యాలను మెరుపర్చుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ కె హిమమహేశ్వరి అన్నారు. మండలంలో గ్రేడ్ 1 నుంచి ఐదు వరకున్న పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు నిర్వహించిన ఒక రోజు శిక్షణను ఆమె ప్రారంభించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఆయా గ్రామాల్లో 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న వారి వివరాలను సేకరించాలన్నారు. వారు చేస్తున్న వ్యాపారాలు, వ్యవసాయేతర వ్యక్తులను గుర్తించి, ఆయా పనుల్లో వారికి కావాల్సిన శిక్షణావసరాలను గుర్తించాలన్నారు. ఆయా రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా ఆయా వృత్తుల్లో మంచి వస్తువులను తయారు చేయడం, నాణ్యత కలిగిన ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయడం ద్వారా ఆదాయం పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలో పూర్తి స్థాయిలో సర్వే చేయాల్సి ఉందని చెప్పారు. ఆయా గ్రామాల్లో శిక్షణ పొందేవారిని గుర్తిస్తే, జిల్లావ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇస్తారన్నారు, పంచాయతీ అధికారులు గుర్తించిన వారి వివరాలను డిజిటల్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు నమోదు చేసి, ఆన్‌లైన్‌లో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భైరవమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ పద్మజారెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ రీసోర్స్‌పర్సన్ శివ శిక్షణ నిర్వహించారు. మండలంలోని 18 గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రిగా మార్చాలి

సీపీఎం ధర్నా



పెద్దాపురం ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

పెద్దాపురం: పట్టణంలోని సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా మార్చాలంటూ అదే హాస్పిటల్ వద్ద శుక్రవారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ, 15 ఏళ్ల క్రితం ఏరియా ఆస్పత్రిగా ఉన్న పెద్దాపురం సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన నేతలు.. నేడు దాని అభివృద్ధిపై దృష్టి సారించిన దాఖలాల్లేవన్నారు. డివిజన్ కేంద్రం కావడం, ప్రతి రోజు సుమారు 500 మంది ఓపీ వస్తుండడంతో నాడు వంద పడకల ఏరియా ఆస్పత్రి భవనం నిర్మించారన్నారు. నేటి పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనపర్తి, పిఠాపురం ఆస్పత్రుల్లాగే, పెద్దాపురం ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ సతీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, డి.సత్యనారాయణ, కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహమూర్తి, చింతల సత్యనారాయణ. వడ్డి సత్యనారాయణ, గడిగట్ల సత్తిబాబు, యాసలపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహబూబ్ సుభాని గంధోత్సవం


గంధోత్సవానికి సిద్ధమైన హజరత్ మహబూబ్ సుభాని జెండా

పెద్దాపురం: ఏటా నిర్వహించే హజరత్ మహబూబ్ సుభాని జెండా గంధోత్సవాలు స్థానిక కవాడి వీధి జెండా జంక్షన్‌లో శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్టు జామియా మసీదు కమిటీ సభ్యులు, అగ్రో మాజీ డైరెక్టర్ సయ్యద్ జానీ తెలిపారు. ఈ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ జెండా గంధోత్సవాల సందర్భంగా శనివారం ఉదయం ఖురాన్ ఖానీ, మధ్యాహ్నం మూడు గంటల నుంచి జెండా వద్ద నుంచి గంధం (సందల్) ఊరేగింపు ఉంటుందన్నారు. ఫకీర్ల మేళా, బ్యాండు, బాణసంచాలతో పుర వీధుల్లో ఊరేగింపు కొనసాగుతుందని చెప్పారు. రాత్రి 8 గంటలకు జెండా జంక్షన్‌కు ఊరేగింపు చేరుతుందన్నారు. అక్కడ ఫాతెహా ఖానీ, అనంతరం గంధం పూస్తారని వివరించారు. అలాగే ఆదివారం సాయంత్రం వస్తదానంతో పాటు, విందు ఏర్పాట్లు చేసినట్టు జానీ తెలిపారు.

పంచారామ క్షేత్రంలో కార్తిక మాస పూజలు


గోపూజ చేస్తున్న పండితులు


స్వామి వారికి జరుగుతున్న తొలి అభిషేకం

సామర్లకోట: పవిత్రమైన పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా కార్తిక మాస పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు ఆలయం తెరచిన వెంటనే భక్తులు హరహర మహాదేవ శంబో శంకరా అంటూ నినాదాలు చేశారు. గోపూజతో స్వామివారికి, అమ్మవారికి పూజలు ప్రారంభించారు. స్వామివారి తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలి అభిషేకం, పూజలు నిర్వహించారు. తొలి అభిషేకంలో మాత్రమే పాలతో అభిషేకం చేశారు. ఆలయానికి వచ్చిన అనేక మంది భక్తులు ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి స్వయంగా అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున, సాయంత్రం ధ్వజ స్తంభం, రావిచెట్టు, జమ్మి చెట్టు, తులసీ చెట్టు వద్ద కార్తిక దీపాలను వెలిగించారు. ఉదయం పులిహోర ప్రసాదంగాను, మధ్యాహ్నం అన్న ప్రసాదాన్ని దేవస్థానం ఏర్పాటు చేసింది. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్తిక మాసం శుక్రవారం కావడంతో అమ్మవారికి భక్తులు కుంకుమార్చన పూజలు చేయించారు.

జగ్గయ్య చెరువులో కబ్జాకోరులు


కబ్జాకు గురవుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- ఖాళీ స్థలాల ఆక్రమణకు యత్నం
- అడ్డుకున్న అధికారులు



అధికారులు స్వాధీనం చేసుకున్న యంత్రాలు

పిఠాపురం: ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేయడానికి పిఠాపురం నియోజకవర్గంలో కబ్జాకోరులు సిద్ధంగా ఉన్నారు. స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో ఖాళీ స్థలాలపై కన్నేసిన రాత్రికి రాత్రే కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. యంత్రాలతో ఖాళీ స్థలాలను చదును చేసి ఎత్తు చేసేందుకు మట్టిని గ్రావెల్‌ను తరలించి స్థలాన్ని ఆక్రమించుకోడానికి యత్నించారు. ఈ విషయం జిల్లా కలెక్టరు దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ మున్సిపల్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులను అడ్డుకుని యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పోలీసులకు అప్పగించారు. ఆక్రమణకు గురవుతున్న స్థలాల వద్ద సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామని, కబ్జాకు ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ కనకారావు తెలిపారు. ఖాళీ స్థలాలను ఎవరైనా ఆక్రమించుకోవాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎంప్లాయీస్ సంఘ్‌తోనే ఉద్యోగులకు న్యాయం


రైల్వే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రతినిధులు

సామర్లకోట: రైల్వే ఎంప్లాయీస్ సంఘ్‌తోనే రైల్వే ఉద్యోగులు, కార్మికులకు న్యాయం జరుగుతుందని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ జాయింట్ జనరల్ సెక్రటరీ, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ జోనల్ సెక్రటరీ భరణి భానుప్రసాద్ అన్నారు. రైల్వే సంఘాల ఎన్నికల నేపథ్యంలో సామర్లకోట వచ్చిన ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సామర్లకోట బ్రాంచి కార్యదర్శి ఎం రమేష్, చైర్మన్ ఈశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ రామకృష్ణ, అసిస్టెంట్ సెక్రటరీ విశ్వప్రసాద్. నాగార్జున, మోహనరావు, చైతన్య, శ్రీను, వైస్ చైర్మన్ గోపాల రెడ్డి, నాయుడు రమేష్, విశ్రాంత ఎంప్లాయీస్ కార్యదర్శి కేవీవీ రావు, అధ్యక్షుడు ఉమా మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో పేట్రేగుతున్న మందుబాబులు


ఉప్పాడ తీర ప్రాంతం


బెంబేలెత్తుతున్న పర్యాటకులు

కొత్తపల్లి: ఆహ్లాదకరమైన సాగర తీరంలో మందుబాబులు పేట్రేగిపోతున్నారు. దీంతో తీరానికి సేద తీరేందుకు వచ్చిన పర్యాటకులు బెంబేలెత్తుతున్నారు. ఉప్పాడ సాగర తీరం, ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో రాత్రి-పగలు తేడా లేకుండా ఎక్కడ చూసినా మందుబాబులు మద్యాన్ని సేవిస్తున్నారు. ఇది చూసి పర్యాటకులు భయభ్రాతులకు గురవుతన్నారు. పట్టించుకోవాల్సిన పర్యాటక శాఖ, పోలీసులు ఏనాడు కూడా తీరంలో పర్యటించి గస్తీ చేసి మందుబాబులను హెచ్చరించిన దాఖలాలు లేవని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యాన్ని సేవించిన సీసాలను పగులగొట్టి తీరంలో వేయడంతో తీవ్ర గాయాలవుతున్నాయి. ఆహ్లాదరంగా ఉండే సాగర తీరం మందుబాబులతో భయంకరంగా మారిందని ఆరోపిస్తున్నారు. చీకటి పడితే బీచ్ రోడ్డులో ప్రయాణించాలంటేనే ప్రయాణికులు హడలెత్తుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

పిఠాపురం: కేంద్ర ఎన్నికల సంఘం, న్యూ ఢిల్లీ, జిల్లా కలెక్టర్, వారి ఆదేశాల ప్రకారం ఈనెల 9, 10, 23, 24 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటరు నమోదు చేర్పులు మార్పుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు పిఠాపురం నియోజకవర్గం అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి తహసీల్దార్ పి.వి.వి.గోపాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారులందరూ ఆయా బూత్‌ల పరిధిలో కేటాయించిన రోజుల్లో అందుబాటులో ఉంటారన్నారు. 37-పిఠాపురం నియోజవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని 242 పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులందరూ అందుబాటులో ఉంటారన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అందుబాటులో ఉంటారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జాబితాలో నమోదు, మార్పులు తొలగింపుల కోసం అర్హులైనవారు వారి పోలింగ్ కేంద్రాల పరిధిలో అధికారులను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన


పంచారామ క్షేత్రంలో చేసిన జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన భక్తులను ఆకట్టుకుంది. కార్తిక మాసం సందర్భంగా ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకున్న వారికి ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. లక్షపత్రి పూజల రసీదు ఆధారంగా జ్యోతిర్లింగార్చనకు అనుమతించారు. దీపాలు వెలిగించడానికి భక్తులు పోటీ పడ్డారు.

లక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు


గాజుల అలంకరణలో లక్ష్మీదేవి అమ్మవారు

సామర్లకోట: పట్టణంలోని మెహర్ కాంప్లెక్స్‌లో వేంచేసి ఉన్న గణపతి ఆలయంలోని లక్ష్మీదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. లక్ష్మీదేవి జన్మనక్షత్రమైన ఉత్తరను పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గాజులతో అలంకరించారు. భక్తులు భారీగా అమ్మవారిని దర్శించుకున్నారు.

రైతుల భూములకు హామీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్

సామర్లకోట: రైతుల స్వాధీనంలో ఉన్న భూమికి హామీగా రీ సర్వే ఉంటుందని తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. పవర పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన రీ సర్వే అవగాహన సదస్సు కు ఆయన అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రైతుల దస్తావేజుల్లో లోపాలను రీ సర్వేలో మార్పు చేస్తారన్నారు. భూముల వాస్తవ పరిస్థితుల కోసం ప్రతి రైతు సహకరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైనప్పుడు నోటీసులిచ్చి రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. ఈ గ్రామ సభలో మొత్తం 20 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరంరెడ్డి సీతామహాలక్ష్మి, మాజీ ఎంపీపీ ఆకునూరి సత్తిబాబు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై శ్రీనివాసు, మండల సర్వేయర్ పి. సీతారామాచార్యులు, సర్వేయర్లు సృజనదేవి, రాజామణి, మోషేరాజు, వీఆర్వోలు ఆర్ సత్యవేణి, టి సుబ్బారావు, ఎస్ పద్మనాభం పాల్గొన్నారు.

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ

మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ-1	85558 71069
ఎంఈఓ-2	94410 73418

సినిమాలు

పెద్దాపురం	
లలితా స్క్రీన్-1	లక్కీ భాస్కర్
లలితా స్క్రీన్-2	క
వీరభద్ర	అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
శోభా	అమరన్
సామర్లకోట	
అనుశ్రీ స్క్రీన్-1	క
అనుశ్రీ స్క్రీన్-2	అమరన్
విఘ్నేశ్వర	లక్కీ భాస్కర్
పిఠాపురం	
వేంకటేశ్వర	క
సత్య	దేవర పార్ట్-1
అన్నపూర్ణ	అమరన్
పూర్ణ	లక్కీ భాస్కర్
ఉప్పాడ	
శ్రీనివాస	లక్కీ భాస్కర్